పోలీస్ స్టేషన్‌లో పాము కలకలం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌లోకి శుక్రవారం రాత్రి రక్తపింజర పాము చొరబడింది. దీన్ని గమనించిన హోంగార్డు అప్రమత్తమై పట్టుకొని అడవికి తీసుకువెళ్లి విడిచి పెట్టాడు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

పామును పట్టుకున్న హోంగార్డు

తెల్లబంగారం కొనుగోలు ఓ నాటకం

- ప్రకటనలకే పరిమితమైన పత్తి మద్దతు ధర
- అమ్మకాలైన తర్వాత మొక్కుబడిగా సిసిఐ కేంద్రం
- జిన్నింగ్ మిల్లుకే తరలించాలని ఆదేశాలు

దళారులు కొనుగోలు చేసిన పత్తి

ప్రజాశక్తి - సాలూరు

తెల్ల బంగారం కొనుగోలుపై ప్రభుత్వం తీరు చూసి రైతులు తెల్లబోతున్నారు. పత్తి కొనుగోలు ప్రభుత్వం నాటకమని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఊరు కాలిపోయిన తర్వాత నుయ్యి తవ్విన చందంగా రైతులు పత్తి పంటను ప్రయివేటు వ్యాపారులకు అమ్మేసిన ప్రభుత్వం ఇప్పుడు మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. సెప్టెంబరులో రైతులు పత్తి ఏరివేత మొదలు పెట్టారు. అదే నెలలో అమ్మకాలు ప్రారంభిస్తారు. కానీ ప్రభుత్వం నవంబర్ మధ్యలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. గడచిన రెండు నెలల్లో దిగుబడైన పత్తిని రైతులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. క్వింటాల్ పత్తిని వ్యాపారులు రూ.6వేలు నుంచి రూ.6500 వరకు కొనుగోలు చేస్తున్నారు. రకరకాల నాణ్యతా ప్రమాణాలు సాకుగా చూపించి ప్రయివేటు వ్యాపారులు ఇప్పటికే 70శాతం ప్రత్తిని కొనుగోలు చేశారు.

ప్రకటనలకే పరిమితమైన మద్దతు ధర

పత్తి కొనుగోలు విషయంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది. క్వింటాల్ పత్తి రూ.7020కు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. కానీ ఈ ధరకు ఎక్కడా కొనుగోలు చేసిన దాఖలాల్లేవు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గురించి రైతులకు తెలిసే లోపలే వ్యాపారులు కొనుగోలు చేపట్టారు. పాచిపెంట మండలంలో 2600 ఎకరాల్లో, సాలూరు మండలంలో 1200 ఎకరాల్లో, మక్కువ మండలంలో 600ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. మన్యంలో ఎక్కువ విస్తీర్ణంలో ఈ ప్రాంతంలోనే పత్తి సాగవుతోంది.

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొద్ది రోజుల క్రితం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏటా ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కానీ కొనుగోలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రతి ఏటా ఆలస్యంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో మద్దతు ధర అందని ద్రాక్షలా తయారైంది. గతంలో ఎఎంసిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పత్తిని కొనే పరిస్థితి ఉండేది. అయితే ఈ ఏడాది రామభద్రపురం మండలంలోని బూశాయివలస వద్ద ఉన్న జిన్నింగ్ మిల్లుకే తరలించాలని చెపుతున్నారు. రైతులకు రవాణా ఖర్చులు చెల్లిస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. మన్యం జిల్లాలో భామిని, సాలూరు, విజయనగరం జిల్లా రాజాంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే అక్కడ కొనుగోళ్లు మాత్రం జరగవు. రెండు జిల్లాల నుండి రైతులు రామభద్రపరం మండలంలోని జిన్నింగ్ మిల్లుకే తరలించాల్సి వుంటుంది. ఇంతవరకు ఎక్కడ కొనుగోలు కేంద్రం వుంటే అక్కడేకొనే పరిస్థితి వుండేది. ప్రయివేటు జిన్నింగ్ మిల్లుకు తరలించాలని కోరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మద్దతు ధర గురించి తెలియదు

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గురించి తెలియదు. సాలూరులో పత్తి కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియదు. సెప్టెంబరులో పంట దిగుబడి అయింది. కొనుగోలు కేంద్రం నవంబర్ మధ్యలో ఏర్పాటు చేశారు. రెండు నెలలు పంటను ఎక్కడ దాచుకుంటాం. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే గ్యారెంటీ లేకనే ప్రయివేటు వ్యాపారులకు క్వింటాల్ రూ.6450కే విక్రయించాం.

పల్లి సింహాచలం,
రైతు, కూర్మరాజుపేట పేట

జిన్నింగ్ మిల్లుకే తీసుకురావాలి

పత్తిని రైతులు రామభద్రపరం మండలం బూశాయివలస వద్ద ఉన్న జిన్నింగ్ మిల్లుకే తీసుకుని రావాలి. రవాణా ఖర్చులు చెల్లిస్తాం. రెండు జిల్లాల్లోని మూడు కొనుగోలు కేంద్రాల నుంచి ఇక్కడికే తరలించాలి. పత్తి నాణ్యతను బట్టి ధర చెల్లిస్తాం.

- భారతి,
ఎఎంసి కార్యదర్శి, సాలూరు

ఆలస్యంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు

నాకు 14క్వింటాళ్ల పత్తి దిగుబడి అయింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై స్పష్టత లేకనే ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకున్నాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకే విక్రయించాం. క్వింటాకు రూ.600 చొప్పున నష్టపోయాం.

కొర్రాయి సూర్యనారాయణ,
రైతు, కూర్మరాజుపేట

మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం సేకరణపై అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు

మద్దతు ధరకంటే తక్కువకు విక్రయించొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పండిన ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తామని కలెక్టరు నిశాంత్ కుమార్ అన్నారు. ధాన్యం సేకరణకు పూర్తి ఏర్పాట్లు చేశామని, సేకరణ పట్ల అపోహలు, రూమర్లు సృష్టించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టరు హెచ్చరించారు. ధాన్యం సేకరణపై అధికారులు, మిల్లర్లు, లారీ సంఘ ప్రతినిధులతో శుక్రవారం జిల్లా కలెక్టరు సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.23 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి అంచనా వేశామని, రైతులు తమ ధాన్యాన్ని జిల్లాలో ఏర్పాటు చేసిన 185 కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు విక్రయించ వచ్చని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకంటే తక్కువకు విక్రయించొద్దని సూచించారు. రైతులను ప్రలోభాలు, ఇబ్బందిపెట్టి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుభరోసా కేంద్రం స్థాయిలో వాలంటీర్లకు సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణపై గ్రామాల్లో ఎవరైనా అపోహలు సృష్టిస్తే వాలంటీర్లు సమాచారం అందించాలని ఆయన స్పష్టం చేశారు.

ధాన్యం సేకరణలో మొదటి పదిరోజులు కీలకమని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని అంచనా వేసి ముందుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా, రైతుల నుంచి ఫిర్యాదుల్లేకుండా సివిల్ సప్లయి, రవాణా, వెలుగు, జిసిసి, వ్యవసాయ, సహకారశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గతేడాది ఎదురైన ఇబ్బందులు, లోపాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంచనాలకు మించి వాహనాలు సిద్ధం చేయాలన్నారు. మిల్లర్లు బ్యాంకు గ్రారంటీలను ఈనెల 20కల్లా అందించాలని, మిల్లర్ల బకాయిలు బ్యాంకు గ్యారంటీలుగా మార్చాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన 15లక్షల గన్నీ బ్యాగులు సిద్ధం చేసి, రైతు భరోసా కేంద్రాలకు పంపిస్తామన్నారు. టెస్టింగు మిషన్లు, బయోమెట్రిక్ మిషన్లు సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐటిడిఎ పిఒలు, ఆర్‌డిఒలు, వ్యవసాయ, సివిల్ సప్లయి అధికారులు ప్రతిరోజు ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. వాతావరణ మార్పులపై రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒలు కె.హేమలత, ఎం.లావణ్య, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు ఎం.దేవుళ్ల నాయక్, జిల్లా సప్లయి అధికారి శివ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అదికారి కె.రాబర్ట్ పాల్, అధికారులు పాల్గొన్నారు.

శంకరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

పోరాట యోధుడు శంకరయ్య

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సిపిఎం వ్యవస్థాపక నాయకులు శంకరయ్య గొప్ప పోరాట యోధుడని, ఆయన మరణం కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు, అతను ఆశయాలు కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలోని అడ్డాపుశీల పంచాయతీ బంటువానివలసలో శంకరయ్య సంతాపం సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శంకరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బంటు దాసు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ శంకరయ్య డిగ్రీ చదువుతూ విద్యార్థి దశలోనే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, శతాబ్ది యోధులు, రైతు ప్రజా పోరాటాల, సామాజిక ఉద్యమ నాయకులని కొనియాడారు. తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా రైతాంగ ఉద్యమాన్ని, సమరశీల పోరాటాలు నడిపిన యోధుడు శంకరయ్య అని కొనియాడారు. ఆయన పోరాట స్పూర్తితో జిల్లాలో మన ప్రాంతంలోని రైతు, కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్మించాలని, ఆయన ఆశయ సాధనకు అందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, రైతులు, నిర్వాసిత, యువజన సంఘాల నాయకులు బంటు ఆదినారాయణ, ఎ.కూర్మయ్య, బంటు విజయ్, సిహెచ్ శ్రీరాము, శివుని నాయుడు, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

- నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి
- వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం

అన్నదాతకు అండగా నిలవాలని, పంట నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి నిర్ణయించింది. ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర్రావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలోని వర్షాభావ పరిస్థితులు, రబీకి నీటి సరఫరా, చెరకు మద్దతు ధర, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తదితర అంశాలపై, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, బొబ్బిలి ఎంఎల్ఎ శంబంగి వెంకట చినప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

జిల్లాకు కరువు నిబంధనలు వర్తించవు

జిల్లాలో ఈ ఏడాది సుమారు 2,32,586 ఎకరాల్లో ఉబాలు జరిగాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు చెప్పారు. అయితే వర్షపాతం లోటు కారణంగా ఇప్పటికే సుమారు 9,221 ఎకరాల్లో పంట ఎండిపోయిందని, మరో 24,332 ఎకరాల్లో ఎండిపోయేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కరువు నిబంధనలను వివరించారు. వర్షపాతం లోటు 19 శాతం కంటే తక్కువ నమోదైనప్పుడే కరువు పరిస్థితి వర్తిస్తుందని తెలిపారు. సెప్టెంబరు 30 నాటికి జిల్లాలో 9 శాతం లోటు మాత్రమే నమోదయ్యిందని, తేమ శాతం, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నా, జిల్లాలోని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించేందుకు అవకాశాలు లేవని చెప్పారు. అయినప్పటికీ కొద్ది రోజుల్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తుందని, ఏమైనా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ, పండిన చోట అత్యధిక దిగుబడి వస్తుందని, మరికొన్ని చోట్ల పూర్తిగా నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని అన్నారు. జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పంట నష్టపోయిన రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని కోరారు. వారికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా నిబంధనలను సడలించాలని, ఈ మేరకు మండలి తీర్మానం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, పంట దెబ్బతిన్న ప్రాంత రైతుల ప్రయోజనాలకు విఘాతం కల్గకుండా పంటకోత నమూనాలను నిర్వహిస్తామని, రైతులకు బీమా పరిహారం వచ్చేలా చేస్తామని చెప్పారు.

చెరకు ధర నిర్ణయం వాయిదా

జిల్లాలో చెరకు పంటకు మద్దతు ధర నిర్ణయాన్ని వాయిదా వేశారు. భీమసింగి చక్కెర కర్మాగారం పరిధిలో సుమారు 11వేల టన్నులు, ఎన్‌సిఎస్ పరిధిలో 90వేల టన్నులు చెరకు దిగుబడి వస్తుందని కేన్ కమిషనర్ వివరించారు. చెరకు కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిన సంకిలి సుగర్ ఫ్యాక్టరీ ప్రతినిధులు చెప్పిన ధరలను జెడ్‌పి ఛైర్మన్, జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఎ శంబంగి అంగీకరించలేదు. రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా ధరలను, ఇన్సెంటివ్‌ను పెంచాలని కోరారు. దీనిపై వచ్చే సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, అందరి అభిప్రాయాలను తీసుకొని మద్దతు ధరను ఖరారు చేయాలని నిర్ణయించారు.

రబీకి నీళ్లిచ్చే పరిస్థితి లేదు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లోను దృష్టిలో పెట్టుకొని రానున్న రబీకి సాగునీటిని అందించే పరిస్థితి లేదని తోటపల్లి, మడ్డువలస, తాటిపూడి రిజర్వాయర్ల ఇంజనీర్లు స్పష్టం చేశారు. కొన్నిచోట్ల ఖరీఫ్ లోనే నీళ్లు తగినంతగా ఇవ్వలేకపోయామని చెప్పారు. రబీకి నీటి విడుదల విషయంలో ముందే స్పష్టమైన ప్రకటన చేస్తే, రైతులు ప్రత్యామ్నాయ పంటలను వేసుకుంటారని సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర్రావు కోరారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, రానున్న రోజుల్లో జిల్లా తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జెడ్‌పి ఛైర్మన్ సూచించారు. దీనిపై వీలైనంత త్వరగా నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించి తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

ప్రతీ ధాన్యపు గింజా కొనుగోలు చేస్తాం

జిల్లాలో పండిన ప్రతీ ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెలాఖరుకు ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. ప్రతీ వాహనానికి జిపిఎస్ ఉంటుందని, అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కూడా కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. కొనుగోలుకు చేస్తున్న ఏర్పాట్లను సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి వివరించారు.

కులగణన సక్రమంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 27 నుంచి మండలంలో నిర్వహిస్తున్న వివిధ సామాజిక వర్గాల జనాభాను తెలుకొనే లక్ష్యంతో కులగణన సర్వేను కార్యదర్శులు సక్రమంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహాశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా కులగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటించి సర్వేను పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించేందుకు సంక్షేమ పథకాలు అమలుకు ఈ కులగణను సర్వే దోహదపడతాయన్నారు. అలాగే కులగణన గురించి ముందుగానే వాలంటీర్ల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి అపోహలను తొలగించాలన్నారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని, వాటికీ సంబంధించిన ధ్రువపత్రాలను అడగనవసరం లేదని అన్నారు. అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఎవరి కులం వారికే నమోదు చేయాలన్నారు. సర్వేలో ఎవరైనా కులం పేరు చెప్పేందుకు ఇష్టపడకపోతే వారిని బలవంతం చేయవద్దన్నారు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుందన్నారు. ఈ సర్వేను ఈనెల 27 నుంచి వారం రోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా ప్రతి ఇంటికి సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి కుటుంబానికి సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయ సిబ్బంది వాలంటీర్లు బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వేను తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేస్తారని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్ ఉన్నారు.

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుల గణన పగడ్బందీగా చేయాలన్నారు. ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలన్నారు. వారి ఆర్థిక పరిస్థితులు వివరాలు పొందుపర్చాలన్నారు. ఇఒపిఆర్‌డి కెకె వర్మ, సతీష్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సీతానగరం : శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

పార్వతీపురంరూరల్ : మండలంలోని 20 సచివాలయాల సిబ్బందికి ఈనెల 27 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కులగణనపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపిడిఒ అకిబ్‌జావేద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కుల గణనపై ముందుస్తుగా ఆయా సచివాలయాల పరిధిలోని వాలంటీర్ల సహకారంతో గ్రామస్తులకు అవగాహన కల్పించి ప్రభుత్వం నిర్దేశించి మార్గదర్శకాలకు అనుగుణంగా గణన చేపట్టి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రమణమూర్తి పాల్గొన్నారు.

వీరఘట్టం : కుల గణనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిఎఫ్‌ఎంఎస్ లాగిన్ ద్వారా వాలంటీర్లతో సర్వే చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ యజమానితో పాటు సభ్యులు వివరాలు నమోదు చేయాలని సూచించారు. కుటుంబం వివరాలు, నమోదైన అనంతరం యజమాని, వాలంటీర్ల ఇకెవైసి తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సూర్యనారాయణ, మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచందర్రావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరఘట్టం : శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన శనివారం ఉదయం 10గంటలకు మండల సమావేశ భవనంలో జరగనున్నట్లు ఎంపిడిఒ అకిబ్‌జావేద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి మండలానికి చెందిన ఆయా శాఖల అధికారులు అభివృద్ధి సమాచారంతో హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌లు ప్రత్యేక అహ్వానితులుగా పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ

గురుకులాన్ని సందర్శించిన డిడిఎంహెచ్ఒ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రజాశక్తిలో ప్రచురితమైన 'గిరిజన విద్యార్థులను వెంటాడుతున్న జ్వరాలు' కథనానికి డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్ స్పందించారు. శుక్రవారం స్థానిక మినీ గురుకులాన్ని సందర్శించారు ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించారు. జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు వైద్య సిబ్బంది వారం రోజులపాటు 24 గంటలూ సేవలందించాలని సూచించారు. గురుకులంలో వంటగదిని పరిశీలించారు. అనంతరం స్థానిక పిహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేసి జ్వరాలపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లాఅధ్యక్షులు రమణారావు

27, 28న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే కార్మిక, రైతు మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. సీతంపేటలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు, రైతులకు ప్రజలకు వ్యతిరేకమైన, కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపడమే మార్గమన్నారు. కొత్తగా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు ఈ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి భయపడే స్థాయిలో కార్మిక, రైతు ఐక్య పోరాటాలు పెరగాలన్నారు. ఈ దిశగా విజయవాడ మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు సీతంపేట మండల అధ్యక్ష, కార్యదర్శి ఎస్.సురేష్, ఎం.కాంతారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ అరుణజ్యోతి

గురుకులంలో కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆప్తాలమిస్టు విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ అరుణ జ్యోతి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

కుళాయి కోసం తవ్విన గొయ్యిను పూడ్చకుండా వదిలేసిన అధికారులు

తవ్వేసి వదిలేశారు...

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రం 28 వ వార్డు దంగిడివీధి ప్రధాన రహదారిలో సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కుళాయి ప్రధాన పైపులైనుకు అదనపు పరికరాలను అమర్చేందుకు 10 రోజుల క్రితం రహదారి పక్కన గోతిని తవ్వారు. పరికరాలను అమర్చకుండా వదిలేయడంతో నిత్యం రద్దీతో కూడుకున్న ఆ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు ద్విచక్ర వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పైపులైనుకు పరికరాల అమర్చి గోతిని పూడ్చి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అనధికార నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

అనధికార నిర్మాణాలకు నోటీసులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని అనధికార నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ టి.జయరాం ఆదేశించారు. శుక్రవారం ఆయన ఒకటో సచివాలయం పరిధిలో అనధికార నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. రైల్వే స్టేషన్ రోడ్‌లో అనధికార నిర్మాణాలను బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఇలాంటి నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు నోటీసులు జారీ చేయాలని బిల్డింగ్ ఇన్ స్పెక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ అహ్మద్, ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు.

బిజెపి నియోజకవర్గ కన్వీనర్‌గా భానోజీరావు

ప్రజాశక్తి-సాలూరు

పురందేశ్వరిని కలుసుకున్న భానోజీరావు

బిజెవి సాలూరు నియోజకవర్గ కన్వీనర్‌గా గొర్లి భానోజీరావు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల బిజెపి నియోజకవర్గ కన్వీనర్లతో విజయవాడలో నిర్వహించిన సమావేశంలో భానోజీరావు ఆమెను కలిశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు వారసుడిగా భానోజీరావు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఈయన గతంలోపిఎసిఎస్ డైరెక్టర్‌గా పనిచేశారు.

'టిడిపితోనే ప్రజల కష్టాలు తీరుతాయి'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన నెల్లికిక్కవ పంచాయతీ జోగిపురంలో బాబు షూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల కష్టాలు తీరాలన్నా, యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా రానున్న ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలో 52 కుటుంబాలు టిడిపి పార్టీలో చేరాయి. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లే టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లక దాసు, యూనిట్ ఇన్చార్జి సోమరావు, బూత్ ఇన్‌ఛార్జిలు అన్నిబాబు, ధర్మ, వెంకటరావు, రమేష్, అనిల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - పాలకొండ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖం పోటీలుని నిర్వహించారు. వెంకమ్మపేటలోని ఎంపియుపి స్కూల్‌లో చిత్ర లేఖనం పోటీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జి.పరాంకుశంనాయుడు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో వెంకమ్మపేట హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గర్ల్స్ హైస్కూల్, తంపటాపల్లి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శనివారం డిజిటల్ లైబ్రరీ మహా విప్లవం అన్న అంశంపై వ్యాస రచన పోటీ గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ లో నిర్వహిమనిగ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలో జిటిడబ్ల్యుఎజిహెచ్ఎస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పి.సింహాచలం, ఎ.శేషగిరి, కె.ప్రశాంతి పర్యవేక్షించారు. గ్రంథాలయ అధికారి గణేష్ బాబు, సహాయకులు రామక్రిష్ణ పాల్గొన్నారు. శనివారం డిజిటల్ లైబ్రరీ మహా విప్లవం అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

భామిని : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం లైబ్రేరియన్ సునీత ఆధ్వర్యాన విద్యార్థులు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు బాలయోగి గురుకులం, కెజిబివి పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిలు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల మరియు అనసూయ పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇంగ్లీషులో పదాలు రాసేందుకు పోటీ పరీక్ష నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని మహర్షి హైస్కూల్లో 35 మంది ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు పోటీపరీక్షల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బి విజయలక్ష్మి, రామకృష్ణ, ఉపాధ్యాయులు, ప్రసాదు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటిముందు బిజెపి బిక్షాటన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎస్సీ, ఎస్‌టిల అభివృద్ధికి ప్రతిపాదించిన 27 పథకాలను తుంగలో తొక్కినందుకు నిరసనగా జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సుందర ఆనందరావు, పార్వతీపురం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ సొండి సంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇంటిముందు బిక్షాటనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికై ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు కానీ వాటి వల్ల ఏం మాత్రం ప్రయోజనం లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు జిల్లాలో ఉన్నప్పటికీ ఇంటర్వ్యూలు చేపట్టలేదని, భూమిలేని నిరుపేద దళిత గిరిజనులకు ఎటువంటి భూమి కూడా మంజూరు చేయలేదని, నిరుద్యోగులకు ఉపాధి కూడా చూపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కనకారావు, యువమోర్చా అధ్యక్షులు పవన్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

పిఎంవివై ద్వారా రూ.3లక్షలు వరకు రుణాలు

ప్రజాశక్తి-పార్వతీరం

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా మైనారిటీ లబ్ధిదారులుకు రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు టి.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ వర్గాలకు ఆర్థికంగా ఆదుకునే దిశగా ఆలోచించి, జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన అర్హులైన మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన 18 రకాల వృత్తిపని వారు అర్హులని పేర్కొన్నారు. సాంప్రదా య కులవృత్తులైన వడ్రంగి, బంగారు ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులు, శిల్పాలు విగ్రహాలు తయారు చేసే వారు, బుట్టలు, చాపలు, మట్టి పాత్రలు తయారు చేసే కుమ్మరి వారు, చీపుర్లు తయారీదారులు, దోబీ, టైలర్, చేప వలను తయారు చేయు వారు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు క్షవర వత్తిదారులు, సంప్రదాయ బొమ్మలు,పూల దండలు, రజకులు పడవల తయారీదారులు, ఇంటి తాళాలు తయారీదారులు అర్హులని తెలిపారు. తమ ధ్రువపత్రాలను తీసుకెళ్లి మీసేవా, సిఎస్ సి కేంద్రాల్లో www.pmvishwakarma.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైతులు పండించే ప్రతి ధాన్యం గింజను రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని, దళారులకు ఎటువంటి అవకాశం ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన వివిధ రకాల పంటలకు, వరికి గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అంతేకాక సరైన సమయంలో పంటలు కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. ప్రతి ధాన్యపు గింజను ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసి దళారుల నుండి రైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఏడాది మాదిరిగా కాకుండా ఇప్పటికే మండలంలో ఈ ఏడాది 10,990 ఎకరాలకు ఇ-క్రాపు వ్యవసాయ శాఖ అధికారులు చేసినట్టు తెలిపారు. దీని ప్రకారం 17వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మండలంలో కొనుగోలు చేయాల్సి ఉందని, దీనికి అనుకూలంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఇప్పటికే గ్రామాల్లో రైతులు కొంతవరకు సేకరించిన ధాన్యాన్ని 83 కేజీలు రూ.1260కు కొనుక్కొని పరిస్థితి ఉందని తెలిపారు. ఇంత జరుగుతుంటే సివిల్ సప్లై అధికారులు మాత్రం కార్యాలయానికే పరిమితమై ఉండే పరిస్థితి ఉందని, కావున రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం

కళ్లాల్లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని చూపుతున్న సాంబమూర్తి

ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. లేనిచో ఈ విషయంపై రైతులందరితో కలిసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాబోయే రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గిరిజన, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు హెచ్.లక్ష్మం, ఆర్.శివున్నాయుడు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి

ప్రజాశక్తి-సీతానగరం

హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. శుక్రవారం ఆయన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో గర్భిణీలకు పక్కాగా ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని తద్వారా, గర్భిణీ ల్లో ఉండే ఆరోగ్య సమస్యలు గుర్తించవచ్చని తెలిపారు. హైరిస్క్ కు కారణమైన ఆరోగ్య సమస్య నివారణ చర్యలు చేపట్టి క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య సేవలకు ఉపయోగించాలని సూచించారు. సంబంధిత సచివాలయం సిబ్బంది ఆర్‌సిహెచ్ పోర్టల్ లో హైరిస్క్ గర్భిణుల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయలన్నారు. అనంతరం వ్యాక్సిన్ స్టాక్, వినియోగం,మిగులు నివేదికలు ఎప్పటికప్పుడు ఈవిన్ లో

సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జెఎఎస్ రిఫరల్స్, ఆరోగ్యశ్రీ అర్హుల చికిత్సకు అవసరమైన కార్యచరణ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పంటలను పరిశీలిస్తున్న రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్

ప్రకృతి వ్యవసాయ లాభాలు తెలుసుకోండి

రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాశ్

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ప్రకతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య తేడాను ప్రతి రైతు తెలుసుకోవాలని, ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్ అన్నారు. పురాతన కాలం నుండి వస్తున్న ప్రకతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనం రసాయన పద్ధతులలో సాగు చేస్తున్న వ్యవసాయం వల్ల కలిగే లాభనష్టాలపై తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. మామిడిపల్లిలో గత ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తాడుతూరి ఈశ్వరరావుకు చెందిన వరి పంటలో రైతు సాగు చేస్తున్న పద్ధతులను పరిశీలించారు. వరి పంటలో క్రాప్ కటింగ్ పద్దతిని రైతు వివరించారు. ప్రధాన పంటకు అయిన ఖర్చులను పొలం గట్లపై తీగజాతి పంటలను వేయటం ద్వారా వచ్చే ఆదాయంతో చేరుకోవచ్చునని తెలిపారు. తమ చుట్టుపక్కల ఉన్న రైతులకు కూడా ఈ విధానం ద్వారా వ్యవసాయం చేయమని తెలియజేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రకాష్ కిచెన్ గార్డెన్, ఎటిఎం మోడల్ విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నుండి మాదిలింగి వెళ్లే ప్రధాన రహదారి వద్ద శుక్రవారం సాయంత్రం ఏడు ఏనుగుల గుంపు సంచారిస్తోందని, పరిసర ప్రాంతాల ప్రజలు, వాహన దారులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఏనుగుల గుంపు సమీప పంట పొలాలను, చెరుకు,అరటి తోటల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆ గ్రామాల రైతులు మాట్లాడుతూ వ్యవసాయ పనులు చేస్తూ పంటలను సాగు చేసుకుంటున్న నిత్యం పొలాల్లో ఉండి జీవనం సాగిస్తుంటామని, ఇలాంటి పరిస్థితుల్లో ఏనుగుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించి మా పంటలను మా ప్రాణాలను కాపాడాలని కోరారు.



కురుపాం ప్రధానరహదారిలో సంచరిస్తున్న ఏనుగులు

కాజీ పేట సమీపంలో ఏనుగులు గుంపు

భామిని : మండలంలోని నల్లారాయిగూడ పంచాయతీ పరిధిలో గల సన్నాయిగూడ, ఇసుకగూడ పరిసర ప్రాంతంలో తిష్ట వేసిన నాలుగు ఏనుగుల గుంపు శుక్రవారం తెల్లవారుజామున భామిని పరిసరాల్లో మూలగూడ, కాజీపేట పరిసర గిరిజన ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ రెండు గ్రామాలు పరిసర ప్రాంతాల్లో పత్తి ఎపుగా పెరిగి, ఏరడానికి సిద్ధంగా ఉంది. ప్రతి రోజు ఈ గ్రామాల నుండి మహిళలు పత్తి ఎరడానికి పొలాలకు వెళ్తున్నారు. ఈ సమయంలో ఏనుగులు దాడి చేసే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు.

నేరాలు ఘోరాలు

మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి పంచాయతీ పాత సినిమాహాల్ పరిసర ప్రాంతంలో గురువారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం కంటపడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బత్తిలి ఎస్ఐ అమ్మన్నారావు మృతదేహాన్ని శుక్రవారం పరిశీలించారు. మృత దేహం బాగా కుళ్లి పోయి నల్లగా ఉండడంతో గుర్తు పట్టలేని విధంగా వుంది. మృతుడు కుంటి వాడుగా, బిచ్చగాడు అయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బత్తిలి ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి పుర్రె లభ్యం

పాచిపెంట : మండలంలోని చిన్న చీపురువలస, కోస్ట్ వలస గ్రామాల సమీపాన పారమకొండ వెనుక భాగంలో పంచమాన జోరు అనే ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి పుర్రె, ఎముకలు లభ్యమయ్యాయి. గ్రామస్తులు, మేకల కాపర్లు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు నేర స్థలానికి వెళ్లి పంచనామ జరిపించి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై ఫక్రుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

జలజీవన్ మిషన్ పైపులు దగ్ధం

రూ.10లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురంలో నిల్వ ఉంచిన జలజీవన్ మిషన్ పైపులు శుక్రవారం ప్రమాదవసాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో రూ.10 లక్షల విలువ గల జల జీవన్ మిషన్ పైపులు ధ్వంసమైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ తెలిపారు. 10 గ్రామాలకు సంబంధించి 25 బండిల్‌లో ఏడు కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు చేయాల్సిన పైపులు అగ్నికి ఆహుతయ్యాయని ఆయన తెలిపారు.

దగ్ధమైపోతున్న పైపులు

జనసేనలో బయటపడ్డ విభేదాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపితో కలిసి సమన్వయంతో పని చేసి అధికారంలోకి రావాలని అనుకుంటున్న జనసేన నాయకుల మధ్య విబేధాలు బట్ట బయలవుతున్నాయి. గురు వారం టిడిపి, జన సేన ఆత్మీయ సమావేశం అందుకు నిదర్శనం. టిడిపితో సమన్వయం విషయం పక్కన పెడితే ముందు జనసేనలో సమన్వయం అవసరమని విమర్శలు వినిపిస్తున్నాయ. జిల్లా కేంద్రంలో జనసేన ముఖ్య నాయకుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, మరో ప్రధాన నాయకుడి గా ఉన్న గురాన అయ్యలు మధ్య సఖ్యత లేదు.. సమన్వయం లేదు అనడానికి గురు వారం జరిగిన సమావేశానికి గురాన అయ్యలకు సమాచారం లేక పోవడమే. ఇటీవల చంద్రబాబు అరెస్టు విషయంలో టిడిపితో కలిసి జరిగిన ఆందోళనల్లో జనసేన ఇచ్చిన ఇచ్చిన కార్యక్రమాలను జిల్లా కేంద్రంలో గురాన అయ్యాలు విస్తతంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కుటుంబ బలం ఉండటంతో పాటు, కొంత కేడర్ కూడా ఉంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న పాలవలస యశస్విని ఆయనను కలుపుకొని వెళ్లడం లేదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించి, ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న యశస్విని గత ఎన్నికల లో ఇదే నియోజక వర్గంలో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఎవరు ఎప్పటి నుంచి పార్టీలో ఉన్నా నాయకత్వంలో ఉన్న వారందరినీ కలుపుకొని వెళ్లాల్సిన సమయంలో తలోదారి పట్టడం పట్ల పార్టీ శ్రేణులు తీవ్ర ఆవేదన చెందుతు న్నాయి. మరో వైపు ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జీల నియామకం కూడా విబేధాలకు దారి తీస్తున్నట్లు తెలుస్తుంది.

గజపతినగరం, నెల్లిమర్ల వంటి నియోజక వర్గాల్లో నియోజకవర్గ ఇంఛార్జి నియామకాల వల్ల కొంతమంది సీనియర్లు అలిగినట్లు తెలిసింది. గజపతినగరం నియోజకవర్గంలో ఇటీవల జనసేనలో చేరిన మాజీ మంత్రి పడాల అరుణ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారనే ప్రచారం సాగుతోంది. నాయకుల మధ్య ఉన్న విబేధాలు సరి చేస్తారా లేదా అనేది త్వరలో అధిష్టానం వద్ద జరిగే పంచాయతీలో తేలనుంది.

తుపాను హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటికే వరి పంట కోతలతో బిజీగా ఉన్న రైతులపై తుపాను వార్త పిడుగులా పడింది. ప్రస్తుతం ఆకాశం మబ్బులు వేయడం, చిన్న చిన్న వర్షపు తుంపర్లు పడడంతోపాటు వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వారంలో కోసిన వరిచేను ఎండకుండా కుప్పలుగా పెడితే కుళ్లిపోయే ప్రమాదం ఉందని, అలాగని వదిలేస్తే వర్షానికి తడిచి పంట మొలకలు వచ్చేస్తుందని భయాందోళన చెందుతు న్నారు. కొంతమంది రైతులు కోసిన పంటలను చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎండకుండా కుప్పలు పెట్టడం వల్ల పెట్టిన పెట్టుబడి కూడా రాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.